సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం : 12 : మార్చి : 2024



సాగునీరిచ్చి ఆదుకోవాలి

కొండపోచమ్మసాగర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. - 9లో



బడ్జెట్‌కు ఆమోదం

మోత్కూరు మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. రూ.19.84 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. - 9లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (మంగళవారం సా॥)

సహర్ 5-04 (బుధవారం ఉ॥)

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 6,369 మంది హాజరు

భువనగిరి : ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం ప్రథమ సంవత్సరం భౌతిక శాస్త్రం, అర్థ శాస్త్రం పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో 6801 మంది విద్యార్థులకు గాను 6,369 మంది హాజరయ్యారు. 432 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు.

మండలాలకు టెన్త్ పరీక్షల సామగ్రి తరలింపు



కలెక్టరేట్‌లో పరీక్ష సామగ్రి

భువనగిరిటౌన్ : పదవ తరగతి పరీక్ష ప్రశ్న పత్రాలు, సామగ్రిని సోమవారం కలెక్టరేట్ నుంచి మండలాలకు చేరవేశారు. పోలీస్ స్టేషన్లలో వీటిని భద్రపరిచారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాలకు సంబంధించిన చిరునామా, పరీక్ష కేంద్రం కోడ్‌ను పరీక్ష సామగ్రి బాక్సలపై ముద్రించారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ప్రారంభం

భువనగిరి : కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భువనగిరిలోని అర్బన్‌కాలనీలో నిర్వహించిన ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని ప్రారంభించారు. 14 రోజుల పాటు సర్వే కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఆశ కార్యకర్త 20 నుంచి 25 గృహాలను సర్వే చేయాలన్నారు. అనుమానితులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. నిర్ధారణ జరిగితే మందులు ప్రతి నెలా మందులు అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోస్ డాక్టర్ ధరణికుమార్, జ్యోతి, సతీష్‌కుమార్, ఏఎస్‌ఎం సునంద, శోభ, మంజుల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



శివపార్వతుల సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర కైంకర్యాలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే యాదాద్రీశుడి ప్రధానాలయంలో సుప్రభాత సేవల, అర్చనలు, అభిషేకం, నారసింహ సుదర్శన హోమం, నిత్య కల్యాణంతో పాటు శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు.

సబ్సిడీపై చాఫ్ కట్టర్లు

భువనగిరిటౌన్ : ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు 20 శాతం సబ్సిడీపై ఇచ్చేందుకు చాఫ్ కట్టర్లు (గడ్డి కత్తిరించే యంత్రం) అందుబాటులో ఉన్నట్లు జిల్లా పశు వైద్యాధికారి సదానందం సోమవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. యంత్రం విలువ రూ.48,000 కాగా రూ.10వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుడు తమ వాటాగా రూ.38,000 డీడీ తీసి ఇవ్వాలన్నారు. దరఖాస్తు ఫారానికి డీడీతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలని కోసి మండల పశువైద్యాధికారి కార్యాలయాల్లో అందజేయాలని కోరారు.

నేటి నుంచి రంజాన్ మాసం

భువనగిరిటౌన్ : పవిత్ర రంజాన్‌మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం నెలవంక కనిపించడంతో ముస్లింలు నేటి నుంచి ఉపవాస దీక్షలు చేయనున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగుతాయి.

యువికాలో పాల్గొనాలి

భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు యువికా(యువ విజ్ఞాన కార్యక్రమం)లో పాల్గొనేలా చూడాలని డీఈఓ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాలకు సూచించారు. యువ విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం అందించేందుకు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) యువ విజ్ఞాన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 20వరకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి సెల్ నంబర్ 9000989726ను సంప్రదించాలని కోరారు.



యాదాద్రి ఆలయ మాడ వీధుల్లో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ తదితరులు

యాదగిరీశుడి సన్నిధిలో.. రెండు గంటలు

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ
- బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- తొలిపూజలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

యాదగిరిగుట్ట: ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి యాదగిరిగుట్టకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. యాదగిరీశుడి సన్నిధిలో రెండు గంటలు ఉన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలోని యజ్ఞమూర్తి ముందు దీప జ్యోతి ప్రజ్వలన చేశారు. రేవంత్‌రెడ్డి తన సతీమణి గీతతో కలిసి తమ కుటుంబం తరపున శ్రీస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బండ్రు శోభారాణి, మాజీ జడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి ఉన్నారు.

- 10.33 గంటలకు కొండపైకి చేరుకున్న సీఎం దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖకు ఉత్తర మాఢ వీధిలో ఆలయ ఈవో రామకృష్ణారావు స్వాగతం పలికారు.

సీఎం పర్యటన సాగిందిలా..

- సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం 9.59 గంటలకు హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు వచ్చారు. పాత గోశాల సమీపంలోని యాగ స్థలిలోని హెలిపాడ్ వద్ద సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండ సురేఖ దిగారు.
- 10.10 గంటలకు ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రెసిడెన్షియల్ సూట్‌కు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, సురేఖ, ఎమ్మెల్యేలు వెళ్లారు.
- 10.27 గంటలకు ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి తన సతీమణి గీతతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి కొండపైకి వెళ్లారు.
- 10.40 గంటలకు ఉత్తర ద్వారం నుంచి ఆలయ తిరువీధులోకి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మంత్రులు వెళ్లారు.
- 10.42గంటలకు తూర్పు త్రితల రాజగోపురం వద్ద సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులకు ఆచార్యులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు.
- 10.44 గంటలకు క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు.
- 10.53 నుంచి 11.07 వరకు స్వయంభూలను దర్శించుకొని, పట్టు వస్త్రాలను సమర్పించారు.
- 11.07 గంటలకు ముఖ మండపంలో యజ్ఞమూర్తి వద్ద దీప జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించి, తొలి పూజలో పాల్గొన్నారు.
- 11.12 గంటలకు ముఖ మండపంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండ సురేఖలకు వేద ఆశీర్వచనంతో పాటు రక్షధారణ చేశారు.
- 11.32గంటలకు ఉత్తర రాజగోపురం నుంచి బయటకు వచ్చి కార్యకర్తలు, నాయకులకు అభివాదం చేసి ప్రెసిడెన్షియల్ సూట్‌కు తిరిగి వెళ్లారు.
- 11.59గంటలకు పాత గోశాలలోని హెలిపాడ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో భద్రాచలం వెళ్లారు.



సీఎం దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆచార్యులు



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి

అమిత్ దారెటు?

- పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయబోనని బీఆర్‌ఎస్ అధిష్టానానికి చెప్పిన అమిత్‌రెడ్డి
- ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ
- దీంతో అమిత్ పార్టీ మారతారంటూ ప్రచారం
- వ్యతిరేక ప్రచారాన్ని ఖండించిన గుత్తా కుటుంబం
- కేసీఆర్‌తో సమావేశానికి అమిత్‌ను ఆహ్వానించని నాయకులు



గుత్తా అమిత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ అధిష్టానం ఓకే అంటే.. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎక్కడినుంచైనా పోటీచేసేందుకు సిద్ధమని పలుమార్లు ప్రకటించిన గుత్తా సుఖేందర్ రెడ్డి కుటుంబం ఒక్కసారిగా యూటర్న్ ఎందుకు తీసుకుంది..? తాము పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయబోమని బీఆర్‌ఎస్ అధిష్టానానికి ఎందుకు తెగేసి చెప్పింది? దీనిపై పరిశీలిస్తే బీఆర్‌ఎస్ పార్టీలోని వర్గపోరే ఇందుకు కారణమని తెలుస్తోంది. తాము పోటీ చేస్తామని చెబుతున్నా ఇతర నేతలతో ఎందుకు సంప్రదింపులు జరుపుతున్నారని, ఇప్పుడే ఇలా ఉంటే రేపు ఎన్నికల్లో ఏం సహకరిస్తారంటూ సుఖేందర్‌రెడ్డి కుటుంబం నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుంచి తాము తప్పుకోవాల్సివచ్చిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అమిత్‌రెడ్డి దారెటు అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో గుత్తా అమిత్‌రెడ్డి భేటీ కావడంతో.. ఆయన పార్టీ మారుతారంటూ ప్రచారం జోరందుకుంది. అయితే, దానిని అమిత్ ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డికి గుత్తా కుటుంబానికి బంధుత్వం ఉండటంతో ఆ ప్రచారం సాధారణమేనని, తాము పార్టీ మారే ఆలోచన లేదని సుఖేందర్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు పేర్కొన్నారు.

పోటీకి సిద్ధంగా ఉన్నామన్నా..

తన కుమారుడు అమిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తాడని గుత్తా సుఖేందర్ రెడ్డి గతంలో ప్రకటించారు. నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో ఎక్కడి నుంచి అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అయితే, బీఆర్‌ఎస్‌లోని జిల్లా నేతలు కొందరు అమిత్‌కు టికెట్ ఇవ్వద్దంటూ అధిష్టానానికి చెప్పారు. మొదటి నుంచీ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డికి మధ్య సఖ్యత లేని కారణంగా మాజీ మంత్రి వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం సాగింది. తాము పోటీ చేస్తామని చెబుతున్నా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఇతరులను బరిలో నిలిపేందుకు చర్చలు జరిపారంటూ గుత్తా వర్గం మండిపడింది. ఈ పరిణామాల నేపథ్యంలో అమిత్ పార్టీ మారతారంటూ ప్రచారం జరిగింది. కాంగ్రెస్ నుంచి భువనగిరి టికెట్ అడుగుతున్నారన్న చర్చ జోరందుకుంది. అయితే, తాము పార్టీ మారుతారనే ప్రచారాన్ని గుత్తా అమిత్‌రెడ్డి ఖండించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా మంత్రి కాబట్టే తాను కలిశానని పేర్కొన్నారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల్లో తాను పోటీచేయబోనని, జిల్లాలో జరిగిన.. జరుగుతున్న పరిణామాలన్నింటిని కేటీఆర్, హరీష్‌రావుకు అమిత్‌రెడ్డి వివరించినట్లు తెలిసింది.

'గుత్తా'కు అందని ఆహ్వానం!

పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నేతలతో సోమవారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీలో నిలిపే అభ్యర్థి విషయంపై చర్చించారు. అనంతరం వారంతా మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సమావేశానికి గుత్తా అమిత్‌కు ఆహ్వానం పంపలేదని తెలిసింది. అందుకే ఆయన హాజరుకాలేదని సమాచారం.

ఆ ఇద్దరిలో ఒకరు

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి విషయంపై మాజీ సీఎం కేసీఆర్‌తో జిల్లా నేతలు చర్చించారు. జగదీష్‌రెడ్డి నేతృత్వంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్యయాదవ్ తదితర నేతలు సోమవారం కేసీఆర్ వద్దకు వెళ్లారు. అభ్యర్థి విషయంలో ఏదైనా నిర్ణయానికి వచ్చారా అని కేసీఆర్ అడగ్గా నలుగురైదుగురు అడుగుతున్నారని చెప్పినట్లు తెలిసింది. అయితే, గట్టి పోటీ ఇవ్వగలిగే వారిలో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి పేర్లను సూచించినట్లు తెలిసింది. వారిద్దరిలోనే ఎవరో ఒకరికి టికెట్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

లక్ష్మిని పోటీ చేయించే యోచనలో కాంగ్రెస్

భువనగిరి ఎంపీ టికెట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. భువనగిరి నుంచి ఎవరైతే భారీ మెజారిటీతో గెలుస్తారన్న విషయంపైనా కాంగ్రెస్ అధిష్టానం సర్వే చేయిస్తోంది. ప్రస్తుతం టికెట్ అడుగుతున్న వారందరి పేర్లతోనూ సర్వేలు చేయించింది. అన్ని విధాలా బలమైన అభ్యర్థినే పోటీలో నిలుపాలన్న ఆలోచనలో ఉంది. అయితే, ఇక్కడి నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మిని బరిలో నిలపాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలిసింది. లక్ష్మిని పోటీ చేయించాలంటూ అధిష్టానం రాజగోపాల్‌రెడ్డిపై ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది.

ఏపీ మాదిరిగా అసెంబ్లీలో చట్టం చేయాలి



నల్లగొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నల్లగొండ టూటౌన్ : కులగణనపై అసెంబ్లీలో చేసిన తీర్మానం వల్ల బీసీలకు ఒరిగేదేమీ లేదని, ఏపీ రాష్ట్రం మాదిరిగా అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి ఆధ్వర్యంలో నల్లగొండలోని చిన వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీసీల హక్కుల సాధనకై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని రెండు నెలల క్రితమే వినతిపత్రం ఇచ్చామన్నారు. 1931లో బ్రిటీష్ పరిపాలనలో కులాల లెక్కలు జరిగాయని, మళ్లీ ఇప్పటి వరకు కులగణన చేపట్టలేదన్నారు. బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ అవకాశాలు రావాలంటే కులగణన ఎంతో కీలకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రూ.20 వేల కోట్లతో బీసీలకు సబ్‌ప్లాన్ తెస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ గట్టు రామచంద్రరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీలు, ఎంబీసీల ఊసే లేదని విమర్శించారు. అనంతరం జూలూరి గౌరిశంకర్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, రాజారాంయాదవ్, బొల్ల శివశంకర్, దూదిమెట్ల బాలరాజు, తదితరులు మాట్లాడారు. సమావేశంలో జాగృతి జిల్లా బాధ్యులు బోనగిరి దేవేందర్, బీసీ సంఘాల నాయకులు నర్సింహ, దత్తాత్రేయ, దుడుకు లక్ష్మీనారాయణ, కొండూరు సత్యనారాయణ, లొడంగి గోవర్ధన్, మిర్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

బొమ్మలరామారం : పంటల సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ పేర్కొన్నారు. రైతులకు సమ్మిళిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు బొమ్మలరామారం మండలంలోని మల్యాల గ్రామ రైతువేదికలో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతు పంటల్లో చీడపీడల లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తించి వాటిని నివారించాలని సూచించారు. ఆత్మ యాదగిరిగుట్ట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడీఏ అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మావతి, ఆత్మ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి పద్మ, ఏఈఓలు వెంకటేష్, రాజశేఖర్, వరలక్ష్మి, మౌనిక పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం గర్భాలయంలో మూలవర్యులకు కంకణధారణ చేయడానికి మేళతాళాలతో వెళ్తున్న ఆచార్యులు, అధికారులు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

మెరుగైన సేవలు అందించినప్పుడే తృప్తి

- ఎయిమ్స్ వార్షికోత్సవంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే

బీబీనగర్ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అప్పుడే అసలైన తృప్తి కలుగుతుందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యరంగం చాలా గొప్పదని దేశానికి తమ సేవలు అందించే స్థాయికి వైద్య విద్యార్థులు ఎదగాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థితికి చేరాలని కోరారు.

ఉత్తమ ఎయిమ్స్‌గా తీర్చిదిద్దుతాం : భాటియా

బీబీనగర్ ఎయిమ్స్‌ను దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతామని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు.ఎయిమ్స్ అభివృద్ధికి రూ.1,366 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం 20 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. బాలురు, బాలికల వసతి గృహాలు, అకడమిక్ బ్లాక్‌లు, ఆడిటోరియం పనులు త్వరలోనే పూర్తికానున్నట్లు చెప్పారు. ప్రసుత్తం 130 పడకలతో ఇన్‌పేషెంట్ విభాగం కొనసాగుతుందని, ఐసీయూలో 20 బెడ్లు అందుబాటులో ఉన్నాయని, ఎమర్జెన్సీ సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంబీంబీఎస్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేశారు. అలాగే ఎయిమ్స్ పురోగతి మార్గిన్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కాళోజీ నారాయణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి, ఎయిమ్స్ డీన్ రాహుల్‌నారంగ్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్ పాల్గొన్నారు.



ఎయిమ్స్ పురోగతి మార్గిన్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎయిమ్స్ అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

తన పేరు గురించి చెబుతూ నవ్వించిన కలెక్టర్

ఎయిమ్స్ వార్షికోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ తన పేరును ప్రస్తావిస్తూ సభికులందరినీ నవ్వించారు. తన పేరు త్రీడీ సినిమా మాదిరిగా మూడు స్టెప్పులుగా ఉంటుందని, స్టేజీలపైకి పిలిచేటప్పుడు అందరూ తికమక అవుతుంటారని తన పేరులోని అర్థాలను వివరించారు. జెండగే తన ఇంటి పేరని, హనుమంతు తన పేరని, కొండిబా తన తండ్రి పేరని తెలిపారు. మూడు పేర్లు కలిగి ఉన్నందున తన అసలు పేరు ఏదో ఎవరికి అర్థం కాదని కలెక్టర్ అనడంతో అందరూ నవ్వారు.

క్లుప్తంగా

గుట్టకు చేరిన అఖండజ్యోతి



అఖండజ్యోతికి స్వాగతం పలుకుతున్న విప్ ఐలయ్య సతీమణి అనిత, భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బర్కత్‌పుర నుంచి ప్రారంభమైన శ్రీస్వామి వారి అఖండజ్యోతి యాత్ర సోమవారం యాదగిరిగుట్టకు చేరుకుంది. ఈనెల 8న బర్కత్‌పురలోని యాదగిరి భవన్‌నుంచి ప్రారంభమైన అఖండజ్యోతి యాత్ర.. ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు చేరుకుంది. గుట్టలో యాదాద్రి ఆలయ అధికారులు, హిందు సంఘాల నాయకులు, పట్టణవాసులు యాత్రకు స్వాగతం పలికారు.

రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ చూపాలి

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : ప్రేరణ ప్రతిభా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి యూనివర్సిటీకి గుర్తింపు తేవాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంజీయూలో ప్రతిభా పోటీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే కళాశాల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు 16న విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన ముగ్గురు విద్యార్థులు ఈ నెల 23న జరిగే రాష్ట్రస్థాయి పోటీలో ఎంజీయూ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, ఎంవీఎన్.రెడ్డి, అరుణ ప్రియ, ఆకుల రవి, శ్రీదేవి, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ రూరల్ : ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని అవకాశాలను మహిళలు సద్విని యోగం చేసుకోవాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి పేర్కొన్నారు. సోమవారం యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. సమాజంలో మహిళల భాగస్వామ్యం, త్యాగాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో పీఓ సైదులు, హరి, పండరయ్య, అరుణ ప్రియ, అనితకుమారి, ప్రగతి, ధనలక్ష్మి, అంజిరెడ్డి, ముత్తిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదం గాలివానలా మారింది. ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం కత్తి పోట్లకు దారి తీసింది. తమ ఫ్లెక్సీలు చింపారని శివాలయ చైర్మన్ కోట్ల సైదులు, ఆయన కుమారులు నవీన్, వంశీలు కత్తులు, రాడ్లతో అదే గ్రామానికి చెందిన నజీర్, అక్బర్‌పై సోమవారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ దాడిలో నజీర్ తీవ్ర గాయాలపాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాదాద్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- విశ్వక్సేనారాధన, స్వస్తీవాచనంతో పూజలు ప్రారంభం
- పంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా వేడుకలు





విశ్వక్సేన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు, తిరువీధిలో శుద్ధజలంలో సంప్రోక్షణ చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం పంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనం, కంకణధారణ.. సాయంత్రం 6.30గంటలకు పుట్టమట్టిలో నవధాన్యాలను నాటడంతో అంకురారోపణం వంటి పూజలు జరిపించారు. ఈ వేడుకలకు ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, యజ్ఞాచార్యులు, రుత్వికులు, వేద పారాయణికులు శ్రీకారం చుట్టారు. తొలి పూజల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గీత దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంత్ కె.జండగే, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి, ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బండ్రు శోభారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఎంపీపీ చీర శ్రీశైలం, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విశ్వక్సేన ఆరాధన

శ్రీస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10గంటలకు విశ్వక్సేన ఆరాధనతో ఉత్సవాలను ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆగమ శాస్త్రనుసారంగా స్వస్తీవాచనంతో వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. స్వస్తీవాచన మంత్ర జలాన్ని గర్భాలయం, ఉప ఆలయాలు, ముఖ మండపం, ధ్వజ స్తంభానికి, ఆలయ తిరుమాఢ వీధులు, భక్తులపై ప్రోక్షణ గావించారు. రక్షాబంధనం పూజలు జరిపించారు. తొలుత గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా బంగారు కవచమూర్తులకు రక్షాబంధనం చేశారు. అనంతరం ఉప ఆలయాల్లోని ఆండాళ్ అమ్మవారికి, ఆళ్వారులకు, విశ్వక్సేనుడికి రక్షాబంధనం గావించి, ముఖ మండపంలోని ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేశారు. సాయంత్రం 6.30గంటలకు మృత్సంగ్రహణం(పుట్ట మన్ను సేకరించుట), అంకురారోపణం వేడుకలను వైభవంగా నిర్వహించారు.



ఉత్సవమూర్తులకు కంకణధారణ చేస్తున్న ప్రధానార్చకులు



ఆలయ ముఖ మండపంలో హోమం చేస్తున్న ఆచార్యులు



పుట్ట మన్నును మంత్ర జలంతో సంప్రోక్షణ గావిస్తున్న ఆచార్యులు

ఉత్సవాల్లో నేడు..

శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో ఉదయం 8గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30గంటలకు భేరి పూజ, దేవతాహ్వానం, హవనం జరిపిస్తారు.

శ్రీలక్ష్మీనారసింహుడికి పోచంపల్లి పట్టు వస్త్రాలు



ఈఓకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: ఏటా జరిగే యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీస్వామి, అమ్మవార్లకు పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను బహూకరిస్తుంటారు. అందులో భాగంగానే సోమవారం ఆ సంఘం నాయకులు పోచంపల్లిలోని శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో పట్టు వస్త్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా యాదగిరిగుట్టకు బయలుదేరి వెళ్లి దేవస్థాన ఈఓ రామకృష్ణారావుకు రెండు పట్టు చీరలు, పట్టు పంచెలు, రెండు శాలువాలను అందజేశారు. అదే విధంగా మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత చంద్రయ్య, మార్కండేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్ పాల్గొన్నారు.

అర్చక ఇనాందారులకు రైతుబంధు ఇవ్వాలి

- తెలంగాణ ఇనాందారుల అర్చక సమాఖ్య అధ్యక్షుడు నరసింహాచార్యులు



సీఎం రేవంత్‌రెడ్డికి శ్రీస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న దేవాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు

యాదగిరిగుట్ట: దేవాదాయ భూములకు ఇనాందారులుగా, అనుభవదారులుగా గతంలో ఉన్నట్లుగా అర్చకుల పేర్లను కొనసాగిస్తూ.. అర్చక ఇనాందారులకు రైతుబంధును అమలు చేయాలని తెలంగాణ ఇనాందారుల అర్చక సమాఖ్య అధ్యక్షుడు కారంపూడి నరసింహాచార్యులు కోరారు. సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వంశపరంపరాగత అర్చకుల పద్ధతులను, తెలంగాణలో ముతవల్లి అనబడే వ్యవస్థలను ప్రభుత్వం నిలిపివేస్తే సంప్రదాయ, గ్రామీణ దేవాలయాలు మూతపడతాయని 1996లో డాక్టర్ ఎంవీ సౌందర్‌రాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించిన విషయాన్ని వివరించారు. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఒక చట్టం ద్వారా అనువంశిక అర్చకుల సేవలను ఆదించిందని, దానిని పునరుద్ధరించాలని విన్నవించారు. తెలంగాణాకు అనువంశిక అర్చకుల వారసత్వం, సర్వీస్ రూల్స్ ఇంకా అమలు కాలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి 2019లో జీఓ ఎంఎస్ 439 ద్వారా అమలులోకి వచ్చాయన్నారు. అర్చకుల సమస్యలను పరిష్కరించి, ఆదుకోవాలన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజ్వేల్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించి శ్రీస్వామి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు: జనాభాలో 55 శాతంగా ఉన్న బీసీలకు చట్ట సభల్లో సమాన వాటా, రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన బీసీ మహా పాదయాత్ర సోమవారం మోత్కూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఓబీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ మేకపోతుల నరేందర్ స్థానికంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మార్చి 1న మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభించిన ఈ మహా పాదయాత్ర ఇప్పటి వరకు 211 కిలోమీటర్లు కొనసాగిందన్నారు. రాజ్యంలో సముచిత స్థానం లేక రాజ్యాంగపరమైన హక్కులు, రిజర్వేషన్లు లేక బీసీ సమాజం అభివృద్ధిలో వెనక్కి నెట్టివేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్లు పటేల్ వనజ, వెలుగు వనిత, నాయకులు సింగారపు అరుణ, బుచ్చిబాబు, గడుపే విమల, బాలస్వామి, ఎర్రమల్ల శ్రీను, బుచ్చిబాబు, శ్రావణ్‌కుమార్, శ్రీహరి, భిక్షపతి గౌడ్, అజయ్ పటేల్, చాపర్తి కుమార్ గాడ్గే, అనంతుల రాంప్రసాద్, కొంగరి నరహరి, స్థానిక బీసీ సంక్షేమ సంఘం నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, గుండగోని రామచంద్రు గౌడ్, పోచం సోమయ్య, పోచం యాదగిరి, గనగాని నరసింహ, మొరిగాల వెంకన్న, ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదాద్రిలో పోలీసుల భారీ బందోబస్తు

- పర్యవేక్షించిన రాచకొండ సీపీ తరుణ్ జోషి



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం వచ్చిన నేపథ్యంలో రాచకొండ సీపీ తరుణ్ జోషి, డీసీపీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు, ఘాట్ దారి, హెలిపాడ్ స్థలం, ప్రెసిడెన్షియల్ సూట్, కొండపైన బస్టాండ్, వీఐపీ గెస్ట్ హౌస్, ప్రధానాలయ ముఖ మండపంలో పోలీసులు విధులు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ పరిసరాలు, ఘాట్ దారి, ప్రెసిడెన్షియల్ సూట్ వంటి ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించి తనిఖీలు చేశారు. ఈ బందోబస్తులో 4అడిషనల్ డీసీపీలు, 8మంది ఏసీపీలు, 11మంది సీఐలతో పాటు 450 మంది పోలీసులు పాల్గొన్నారు.

సీఎం రాకతో భక్తుల ఇబ్బందులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు వచ్చారు. భద్రత దృష్ట్యా పోలీసులు ఆలయ పరిసరాలన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఉదయం 8.45 నుంచి సీఎం వెళ్లే వరకు భక్తులను కొండపైకి అనుమతించలేదు. ముఖ్యమంత్రి వెళ్లిన తరువాత మధ్యాహ్నం 12.15 గంటలకు స్వామివారి దర్శనానికి అనుమతించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడిపై హత్యాయత్నం

- వేట కొడవలితో రౌడీ షీటర్ దాడి
- పోలీసుల అదుపులో నిందితుడు ?



గాయపడిన శిగ నరేష్

భువనగిరి క్రైం : భువనగిరి పట్టణంలో పట్టపగలే ఒకరిపై హత్యాయత్నం జరిగింది. అందరూ చూస్తుండగానే నయీం అనుచరుడు వేట కొడవలితో డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లికి చెందిన శిగ నరేష్ భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా డయగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగా నరేష్ డయాగ్నోస్టిక్ సెంటర్ తెరిచి బయట ఫోన్‌లో మాట్లాడుతుండగా నయీం అనుచరుడు, పాత నేరస్తుడు, రౌడీ షీటర్ బాబా వెనుక నుంచి వేట కొడవలితో దాడి చేశాడు. రెండు సార్లు అతను వేటు వేయగా అప్రమత్తమైన నరేష్ ఆస్పత్రిలోకి పరిగెత్తాడు. దాడిలో నరేష్‌కు చెవి, వీపు భాగంలో గాయాలయ్యాయి. గతంలో నయీం ఉన్నప్పుడు నరేష్‌ను ల్యాబ్ ఖాళీ చేయాలని బెదిరించినట్లు, పాత కక్షల కారణంగానే దాడి జరిగినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గతంలోనూ గుర్తుతెలియని వ్యక్తులు నరేష్‌పై మూడు పర్యాయాలు దాడులకు పాల్పడినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. అయితే, ఇప్పటికే నిందితుడు బాబాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఈ ఘటనపై డీసీపీ రాజేష్ చంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. మళ్లీ నయీం అనుచరుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, పాత నేరస్తులపై నిఘా ఉంచి శాంతి భద్రతలను కాపాడాలన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ పొత్తంశెట్టి వెంకటేశ్వర్లు, కుక్కదూగ సోమయ్య, బెండ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. వృద్ధుడు మృతి

మిర్యాలగూడ టౌన్ : కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం రేగులగడ్డకు చెందిన లింగం పాపులు(65) బైక్‌పై మిర్యాలగూడకు బయలుదేరాడు. మార్గమధ్యలో తుంగపాడు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాపులుకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందు తూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఉమాపతిరావు తెలిపారు.

ఫణిగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో కలిసి ఫణిగిరిలో బౌద్ధ మ్యూజియం ప్రారంభం



మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్, చిత్రంలో శైలజారామయ్యర్ తదితరులు



తవ్వకాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్, చిత్రంలో రాష్ట్ర అధికారులు, కలెక్టర్

తిరుమలగిరి (తుంగతుర్తి): ఫణిగిరి మ్యూజియాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నాగారం మండలం ఫణిగిరి గుట్ట వద్ద సోమవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, పురావస్తు వారసత్వ శాఖ సంచాలకులు భారతిహోలికేరి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్‌రావుతో కలిసి మ్యూజియం ప్రారంభించారు. అనంతరం పురావస్తు తవ్వకాల పనులను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో ఫణిగిరికి ప్రత్యేక స్థానం కల్పించనుందన్నారు. బౌద్ధ సంపద రక్షణకు తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా ఇక్కడ మ్యూజియం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గుట్టపై 83 ఎకరాలకుపైగా ఉన్న బౌద్ధ స్థూపం ఆవరణలో తవ్వకాల పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. వీటిని 90 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఫణిగిరిలో 1941 నుంచి 1944 వరకు 12సార్లు తవ్వకాలు జరిపినట్లు తెలిపారు.

బౌద్ధ సంపద రక్షణకు ప్రాధాన్యం : ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్

బౌద్ధ సంపద రక్షణకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ అన్నారు. ఫణిగిరిలో ఆమె మాట్లాడుతూ తవ్వకాల్లో బయటపడిన తొమ్మిది బౌద్ధ పురాతన స్థూపాలు ఇటీవల అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో ప్రదర్శించామన్నారు. పర్యాటక చరిత్రలో కీలకమైన ప్రదేశంగా ఫణిగిరి అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఫణిగిరి కొండపై ఉన్న స్థూపాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ శాఖ డీడీ నారాయణ, మ్యూజియమ్స్ డీడీ నాగరాజు, ఏడీ మల్లునాయక్, నర్సింగ్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ శోభారాణి, ఆర్కిటెక్ ఇషాక్, కన్సల్టెంట్ పద్మనాభం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పొట్టకూటికి వచ్చి మృత్యుఒడికి

- రైస్ మిల్లు గోదాంలో గోడ కూలి ఇద్దరు హమాలీలు మృతి
- మృతులు బిహార్ రాష్ట్ర వాసులు



మిల్లులో గోడ కూలిన ప్రదేశం

మిర్యాలగూడ : పొట్టకూటికి వలస వచ్చిన ఇద్దరు బిహార్ రాష్ట్ర కార్మికులను గోడ రూపంలో మృత్యువు కబళించింది. బిహార్ రాష్ట్రానికి చెందిన సుమారు 50మంది కార్మికులు మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలోని భరణి రైస్ మిల్లులో హమాలీలుగా పనిచేస్తున్నారు. గోదాంలో ఉన్న ధాన్యం బస్తాలను మిల్లింగ్ చేసేందుకు సోమవారం పది మంది హమాలీలు బయటికి తీస్తున్నారు. ఈ క్రమంలో గోదాం మధ్యలో ఉన్న ఎత్తయిన గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఎనిమిది మంది హమాలీలు గోడ కూలుతున్న దృశ్యాన్ని గమనించి బయటకు పారిపోయారు. బస్తాలు ఎత్తుతున్న గంగా ప్రసాద్(55), రఘువీర్‌సాహు(45)పై గోడ పడడంతో శిథిలాల కింద ఇరుక్కుపోయారు. ఆపై పైనుంచి వందల బస్తాలు పడిపోయాయి. వెంటనే మిల్లు యాజమాన్యం, కార్మికులు అప్రమత్తమై సమీపంలో ఉన్న జేసీబీని తీసుకొచ్చి బస్తాలను తొలగించారు. శిథిలాల నుంచి ఇద్దరిని బయటికి తీయగా అప్పటికే మృతిచెందారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకుంటామని మిల్లు యాజమాన్యం హామీ ఇచ్చింది. ఎత్తయిన గోడకు రెండు వైపులా బస్తాలు ఉన్నాయి. ఒక వైపు బస్తాలు తీస్తుండగా మరో వైపు ఉన్న బస్తాల బరువు గోడపై పెరగడంతోనే కూలి ఉంటుందని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

యాదాద్రి కొండపై కాంగ్రెస్ నాయకుల నిరసన



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై సోమవారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు.. ఆలయంలోనికి వెళ్లారు. తమను కూడా పంపించాలని కొండపైన, మాడ వీధుల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కోరారు. పోలీసులు నిరాకరించడంతో ఆందోళనకు దిగారు. పోలీసుల డౌన్‌డౌన్, పోలీస్ జులుం నశించాలి అంటూ నినాదాలు చేశారు. తమ ప్రభుత్వంలోనూ తమను సీఎం వెంట ఆలయంలోకి అనుమతించకపోవడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. సీఎంను కలవడానికి వచ్చిన వారిలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీలు నరాల నిర్మల, రమేష్, రాష్ట్ర నాయకులు ఎల్లంల సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

భువనగిరి క్రైం : రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయగిరి రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాల వ్యక్తి మృతదేహాన్ని రాయగిరి రైల్వే స్టేషన్ దిగువ పట్టాలపై స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు ఘటన స్థలాన్ని పరిశీలించారు.మృతుడి వద్ద ఏలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఒంటిపై తెలుపురంగు లుంగి ఆకుపచ్చ, గోల్డ్ కలర్ అంచు కలిగి, గోధుమ రంగు శాలువ, రుద్రాక్ష మాల ధరించి ఉన్నాడు. గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పార్టీ మార్పు ప్రచారం.. ప్రత్యర్థుల కుట్ర

- టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం ప్రత్యర్థుల కుట్ర అని టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోవడం వీలుకాక తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనను బదనాం చేసే చర్యలు ఇప్పటికైనా మానుకోవాలని, కారణాలు చూపకుండా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పుడు పార్లమెంట్ టికెట్ ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత నిర్ణయం బాధగా ఉన్నా, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. చివరి శ్వాస వరకు కాంగ్రెస్, రేవంత్‌తోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. నల్లగొండ పార్లమెంటు అభ్యర్థి ఎంపిక సమయంలో తనకు సముచిత స్థానం కల్పిస్తామని ఏఐసీసీ, పీసీసీ నుంచి స్పష్టమైన హామీ ఉందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాజా, షఫీవుల, వెలుగు వెంకన్న, గోదాల రంగారెడ్డి, గట్టు శ్రీను, స్వామి నాయుడు, పిల్లల రమేష్ నాయుడు, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.